

# క్రిస్మస్ చెట్టు

గోపరాజు నారాయణ రావు



# క్రిస్మస్ చెట్టు

## డాక్టర్ గోపరాజు నారాయణరావు

గాలి నిండా ఘాటైన మందుగుండు వాసన... చుట్టలు చుట్టలుగా నిలువెత్తు ముళ్లకంచె, కనుచూపు మేర ఎటు చూసినా...ఆ కంచెకే చిక్కుకుని సర్వీస్ డ్రెస్‌లోనే కుళ్లుతున్న ఏదో దేశం సైనికుడి మృతదేహం, ఒకచోట.... బురదనేలలో కూరుకుపోయిన సైనికుల శవాల హృదయ విదారక దృశ్యాలు, అడుగడుగునా ... కుళ్లుతున్న గుర్రాల కళేబరాలు... వాటి దుర్గంధం... ట్యాంకులూ, షెల్స్ పేలుళ్లతో ఆకులన్నీ రాలిపోయి బోడిగా నిలబడి ఉన్న చెట్లు .. వాటి పేలుళ్లకే గోతులు పడిన నేల.... తునాతునకలైన వాహనాలు.... అలాంటి వాతావరణంలో, అక్కడ ఈ సంఘటన జరగడం ఊహకు కూడా అందదు.

ప్రతి రేణువూ రక్తంతో తడిసిన రణభూమి – నో మ్యాన్స్ ల్యాండ్. బాంబులూ, తూటాలూ యథేచ్ఛగా ప్రాణాలతో ఆడుకునే ఆ చోటు... కొద్దిసేపు బంతాటకి మైదానంగా మారిపోవడం చూసి కాలం నివ్వెరపోయి ఉంటుంది. లక్షల ఆర్తనాదాల మధ్య వినపడిన ఆ స్ఫుటమైన కేరింత విని చరిత్ర చలించిపోయి ఉంటుంది.

ఊహకే కాదు, చరిత్రకే అందని అద్భుతం– యుద్ధభూమిలో బంతాట. అంతవరకు ప్రపంచం చూడని మహా సంగ్రామంలో వైరి శిబిరాల సైనికులు ఆయుధాలు దించి,

ఆటలో మునిగిపోయిన అరుదైన సన్నివేశమది.

'సకల యుద్ధాలకూ స్వస్తి చెప్పే యుద్ధం' తిరిగి తిరిగి భూగోళాన్ని యుద్ధభూమిగా మార్చింది. యుద్ధాలు లేని ప్రపంచాన్ని నిర్మించడానికి జరిగిన ఆ సమరం అక్షరాలా లక్షల మందిని బలితీసుకుంది. అదే గ్రేట్‌వార్– మొదటి ప్రపంచ యుద్ధం.

రవి అస్తమించని సామ్రాజ్యం ఒకవైపు, సూర్యుడి మీద చోటు కోసం కాలు దువ్విన సామ్రాజ్యం మరోవైపు మోహరించి చేసిన యుద్ధం– గ్రేట్‌వార్.

అది మనుషుల చేత సాంకేతిక పరిజ్ఞానం చేయించిన మొదటి యుద్ధం.

కందకాలని పిలిచే నిలువెత్తు గోతులలో సగం ఖననమైపోయి సైనికులు చేసిన మొదటి యుద్ధం.

శత్రువుల మీద రసాయనాలు కురిపించిన తొలి యుద్ధం.

భూ ఉపరితలం చాలక మొదటిసారి గగనతలానికి కూడా పాకిన యుద్ధం– గ్రేట్‌వార్.

గ్రేట్‌వార్ అంటే –నవ యౌవన దేహాలు చిమ్మిన ఉష్ణ రక్తకాసారాలు. నూనూగు మీసాల మృతదేహాల దిబ్బలు.

అది మహా సామ్రాజ్యాల ని కాలగర్భంలోకి నెట్టిన యుద్ధం.

అటు రష్యాలో కమ్యూనిజానికి ఊపిరి పోసిన యుద్ధం.

ఇటు జర్మనీకి పురుడు పోసి నాజీలను భూమ్మీదకు తెచ్చిన యుద్ధం.

అక్కడ పరమ శత్రువులు ఫుట్‌బాల్ ఆడడం ఎలా వీలు పడింది? క్రిస్మస్‌కు కాస్త ముందు తలెత్తిన చిన్న అపోహ ఇంత పెద్ద ఘట్టానికి కారణం కావడమే ఒక చరిత్రాత్మక అద్భుతం. అందుకే ఆ రచయిత ఎవరో అదంతా రికార్డు చేశాడనిపిస్తోంది.

కదిలిపోయిన పేజీలతో, నలిగిపోయిన అట్టలతో మీరు పంపిన ఆ పుస్తకం చదువుతున్నంత సేపూ, అనువదిస్తున్నంత కాలం హైరానా పెట్టిన ఆలోచనలూ, అంచనాలూ , భయాల గురించి చెప్పాలంటే ఇక్కడ సాధ్యం కాదు. వాటితో నేనూ పెద్ద యుద్ధం చేయవలసి వచ్చింది. కొంచెం శ్రమ పడ్డా ఇతివృత్తాన్ని బట్టి మాటలకు అందనంత తృప్తి మిగిలింది. ఇలాంటి ఇతివృత్తంతో వచ్చిన రచనను అనువదించే అవకాశం నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు. క్రిస్మస్ సంచిక కోసం అని మీరు చెప్పినా, భూమండలాన్ని బలిపీఠంలా మార్చిన ఆ మారణహోమం వందేళ్ల సందర్భం మీ మనసులో ఉందనుకుంటున్నాను. స్వేచ్ఛానువాదం చేయమన్నారు. నా శక్తి మేరకు ప్రయత్నించాను. ఇక తీర్పు చెప్పవలసింది ఎడిటర్‌గా మీరూ, ఆపై మన పాఠకులే. మీరు చెప్పినట్టే కొద్ది పరిశోధన అవసరమైంది. పాఠకుల సౌకర్యం కోసం చిన్న చిన్న మార్పులు

చేయడమూ మంచిదనిపించింది. 'గ్రేట్ వార్' - మహా యుద్ధం- అంటూ మూల రచయిత వాడిన మాటనే ఉపయోగించాను. మొదటి ప్రపంచయుద్ధాన్ని అప్పుడు అలాగే పిలిచారు. అన్నట్టు ఈ కథలలో కనిపించే పాత్రలన్నీ నిజ జీవితంలోనివే. ఈ సంఘటనని ఉత్తరాలలో, డైరీలలో రాసి పెట్టిన సైనికులనే పాత్రలుగా చేశాడా రచయిత. ఈ యుద్ధంలో ఆయా దేశాల తరపున తుపాకీ పట్టిన ముప్పయ్ మంది వరకు కవులూ ఉన్నారు. వీళల్లో కొందరు యుద్ధంలో మరణించారు కూడా. చావకుండా మిగిలిన వారిలో ఎవరైనా ఇది రాశారేమో! శీర్షిక మీరు చెప్పినదే బాగుంది. ఆ రచయిత ఎలాంటి ముగింపు ఇచ్చాడో తెలియదు కానీ.....'

పెద్ద లేఖ. ఇంకో మూడు, నాలుగు పేజీలు .........

చదివే ఓపిక లేక కాదు కానీ, మొదట ఆ అనువాదం చదవాలన్న ఉత్కంఠతోనే లేఖను నిర్దాక్షిణ్యంగా వెనక్కు మడిచి నేరుగా కథలోకి ప్రవేశించాడు ఆ పత్రిక ఎడిటర్.

## 1

''ఫాల్''

ఫైర్‌స్టెప్ మీద నిలబడి బయటకు చూస్తున్న లెఫ్టినెంట్ ఎడ్వర్డ్ హూల్స్ కుడిచేతిని పిడికిలిగా చేసి ఎడం అరచేతిలో శక్తికొద్దీ గుద్దుతూ కొంచెం బిగ్గరగానే అన్నాడామాట. బ్రిటిష్ సేనలో సెకండ్ స్కాట్స్ దళానికి చెందినవాడతడు.

ఫ్రీలింఘీన్ అండ్ హూప్‌లైన్స్ సెక్టర్ అది. ఫ్లాండర్స్ అని పిలుస్తారు, ఆ ప్రాంతాన్ని. ఫ్రాన్స్ సరిహద్దుకు కాస్త దూరంగా, బెల్జియంకు కొంచెం దగ్గరగా ఉంది. అక్కడే తమ సేన విడిది చేసి ఉన్న కందకం (ట్రెంచ్)లో ఫైర్‌స్టెప్ మీద నిలబడి ఉన్నాడతడు. కందకం లోపలి ఆ భాగాన్ని ఫ్రంట్‌లైన్ అంటారు. యుద్ధ వ్యూహాలకి చాలా కీలకమైనది. ఉరికి వస్తున్న శత్రుసేనకి మొదటిగా అడ్డుకట్ట వేసే చోటు అదే.

వందా రెండు వందలూ కాదు, బెల్జియం సరిహద్దుల నుంచి ఫ్రాన్స్ సరిహద్దుల వరకు వైరి వర్గాలు ఎదురెదురుగానే ఏడొందల కిలోమీటర్ల మేర నిర్మించాయి కందకాలు. ఇదే పశ్చిమ యుద్ధరంగం.

శత్రుదేశాల సైన్యాలు మోహరించి ఉన్న కందకాలకు మధ్య ఉండే ఖాళీ స్థలమే - నో మ్యాన్స్ ల్యాండ్.

కందకం గోడకే, నేలమట్టం నుంచి రెండు మూడడుగుల ఎత్తులో అరుగులా ఉండే చోటుని ఫైర్‌స్టెప్ అంటారు. పాదం మోపడానికి చాలినంత స్థలమే అది. శత్రుదేశం సైనికుల మీద కాల్పులు జరపాలంటే ఎవరైనా అక్కడ నిలబడవలసిందే. అంటే శత్రు

శిబిరానికి అభిముఖంగా ఉంటుంది. తుపాకీ గురిపెట్టి రెండు మూడు గంటల పాటు ఫైర్‌స్టెప్ మీద నిలబడి ఉండడం ఏ సైనికుడికైనా అలవాటై ఉంటుంది. అక్కడ నిలబడిన సైనికుడిని దూరం నుంచి చూస్తే తల వదిలి నిలువునా పాతరేసినట్టు కనిపిస్తాడు.

కందకం ఉపరితలం నుంచి ఏడెనిమిది అడుగుల అవతల ఇసుక బస్తాలూ, మోటు కఱ్ఱలతో నిలబెట్టిన ఒకటిన్నర అడుగుల ఎత్తు పేరాపెట్ వాల్ కనిపిస్తోంది. పేరాపెట్ వాల్‌కి దాదాపు పన్నెండడుగుల అవతల, ఉంది బార్బ్‌డ్ వైర్ – ముళ్లకంచె– చూడగానే ఒళ్లు జలదరించేటట్టు.

ఏదో తగిలి పేరాపెట్ వాల్‌లో అక్కడ రెండు బస్తాలు పడిపోయి కంతలా ఏర్పడింది. ఆ కంత నుంచి చూస్తున్నాడు, లెఫ్టినెంట్ హూల్సే – ఆ బంతాట.

బురద కొట్టుకుపోయిన బూట్లతో; ఖాకీ, పసుపు, ఆకుపచ్చ, నలుపు, ఎరుపు, నీలం రంగుల యూనిఫారాలలో ఉన్న కాళ్లు కసిగా తన్నుతున్నాయి, ఆ ముక్కుపొడుం రంగు తోలు బంతిని – ధన్..ధన్..,.ధన్.....ధన్... ధన్.....

హూల్సే కంటి చూపుకు దొరకడం లేదు బంతి. కసిగా తన్నుతున్నారు, తన్నుతూ అరుస్తున్నారు. ఉత్సాహంగా సాగుతోంది ఆట.

ఇక్కడ, ఫైర్‌స్టెప్ మీద ఉన్న హూల్సేకి నిప్పుల మీద నిలబడి ఉన్నట్టే ఉంది.

అసహనంతో అతడి బూటు కాళ్లు స్థిరంగా నిలబడలేక పోతున్నాయి.

కొద్దిసేపటి క్రితమే ఫ్రాన్సు దేశ సరిహద్దులలో ఉన్న సెయింట్ ఒమర్ పట్టణం నుంచి ఉరుకులూ పరుగులతో ఇక్కడికి తిరిగివచ్చాడు హూల్సే.

ఆ క్షణంలో చూడాలి అతడిని! గుండె పగిలిపోతుందేమోనన్నంత ఉద్రేకం. తలలో నరాలు చిట్లిపోతాయేమోనన్నంత ఆవేశం. భీకర యుద్ధరంగంలో నో మ్యాన్స్ ల్యాండ్ ఫుట్‌బాల్ మైదానంలా మారిపోవడం చూసి దాదాపు పిచ్చెక్కినంత పనైంది లెఫ్టినెంట్ హూల్సేకి.

ఊహకేమిటి?! చరిత్రకే అందని విషయం– యుద్ధభూమిలో బంతాట.

'ఫాల్' అంటూ పైకి అనేశాడు కానీ, అతడి మాటకు అతడే అదిరిపడ్డాడు మళ్లీ. వెంటనే సుతారంగా నాలుక్కరుచుకుని చుట్టూ చూశాడొకసారి. వినడానికి ఎవరూ లేరని రూఢీ అయ్యాక కాస్త స్థిమితపడ్డాడు. నిజానికి ఆ క్షణంలో అతడిని కొంచెం చల్లబడేటట్టు చేసింది ఆ పొరపాటే. దానితో వచ్చిన ఆ తొట్రుపాటే.

తన కాళ్లకింద ఉన్న మందుపాతరని తనే నిర్వీర్యం చేయవలసి వచ్చినట్టుంది లెఫ్టినెంట్ హూల్సే పరిస్థితి, ఆ క్షణంలో. తీక్షణతని పెంచుకుంటూ ప్రశ్న వెంట ప్రశ్న బుర్రనిండా. పెరిగిపోతున్న హైరానా నరనరాన్నీ మెలిపెడుతోంది. బిగించిన దవడ

ఎముకని సడలించే అవకాశం ఇవ్వడం లేదు, ఉడుకుతున్న రక్తం. ఆవేశంతో ఛాతి ఎగసిపడుతోంది. కణతల మీద నరాలు ఉబ్బిపోయి ఉన్నాయి. ముక్కుపుటాలు, పెదవులు ఉక్రోషంతో అదురుతున్నాయి. గులాబీ రంగు ముఖం ఎరుపెక్కిపోయింది. బంతాట కళ్లపడ్డాక ఇదే అతడి పరిస్థితి.

సరిగ్గా అప్పుడే - ఒకరెవరో గోల్ చేయబోతుంటే 'డి' సర్కిల్ దగ్గరే వాడెవడో కాలు అడ్డం పెట్టాడు. ఏమైందో, ఎలా జరిగిందో- రెప్పపాటులో జరిగిపోయింది. వాడూ, గోల్‌కీపర్ ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొనడం, బంతి భూతలం నుంచి శరవేగంగా ఆకాశం వైపు దూసుకుపోవడం ఒక్కసారే జరిగిపోయాయి. అంత వేగంతోనూ హూల్సే చూపు కూడా బంతిని వెంటాడింది.

ఏటవాలుగా కొంత ఎత్తుకి దూసుకెళ్లి, కింద పడుతూ కాస్త అవతల పదిహేను అడుగులు వరకు ఎత్తున్న ఒక చెట్టుకొమ్మని తాకింది తోలు బంతి.

ఒక్క ఆకు కూడా లేకుండా కొమ్మలతో అనాచ్ఛాదితంగా ఉంది చెట్టు. ఆ కొమ్మలన్నీ దట్టమైన తెల్లని తొడుగు వేసుకున్నట్టు ఉన్నాయి, డిసెంబర్ మాసపు మంచుతో.

బంతి తాకిడికి దూది పింజల్లా చెల్లాచెదురైపోయింది మంచు తొడుగు.

అంతే! అప్రయత్నంగా హూల్సే పెదవులు దాటుకుని వచ్చేసిందా మాట, 'ఫౌల్' అంటూ. అలా అరిచేటట్టు చేసింది అతడిలోని క్రీడాస్ఫూర్తి. ఆ లెఫ్టినెంట్‌ని అంతగా భయపెడుతున్నది అతడిలోని రాజభక్తి.

తన నోట ఆ మాట కొంచెం గట్టిగానే వెలువడినా, ఆ శబ్దం ఆట జరుగుతున్న ప్రదేశం వరకు- అరవై డెబ్బయ్ గజాలలోనే ఉన్నా- వెళ్లదనీ, వెళ్లినా ఆ కోలాహలంలో ఎవరికీ వినిపించదనీ హూల్సేకి తెలుస్తూనే ఉంది. అంతా కోలాహలం... ఉద్వేగం. ఆకాశమే హద్దు అన్నట్టున్న ఆనందం అక్కడంతా.

హూల్సేకి ఆటగాళ్ల మీద వచ్చిన కోపం, ఒక్క లిప్తపాటు ఆటలో జరిగిన ఆ పొరపాటు మీదకు మళ్లింది, అంతే తీవ్రంగా. గోల్‌కీపర్‌ని ఢీకొట్టి ఫౌల్ చేసిన వాడు ఎవడా అనుకుంటూ నో మ్యాన్స్ ల్యాండ్ కేసి తేరపార చూశాడు హూల్సే. చూడబోతే ఆ బంతిని అలా కొట్టిన ఘనుడు బ్రిటిష్ వాడిలాగే ఉన్నాడు. ఖాకీ యూనిఫారమ్‌లో పరుగెడుతున్న ఆ సైనికుడిని చూసి నిర్ధారించుకున్నాడు హూల్సే. అది బ్రిటిష్ సైనికుల యూనిఫారమే. వాడు తలొంచుకుని పరుగెడుతుంటే అంతా మెత్తగా గేలి చేస్తున్నారు. 'ఇంగ్లండ్‌లో తప్ప పుట్టాడు వెధవ! అసలు యూరప్‌లోనే తప్ప పుట్టాడు' అనుకున్నాడు హూల్సే , ఇక్కడ. అంత కోపం వచ్చింది. ఓ ఇంగ్లిష్ వాడి కడుపున పుట్టి ఇంత దారుణంగా ఫౌల్ చేస్తాడా? అనుకున్నాడతడు.

అయినా..... ఇదేమిటి?!

అసలు ఈ మ్యాచ్ జరగడమే విపరీతం అని ఆవేశపడిపోతూ, ఓ పక్క, మళ్లీ తనే వ్యాఖ్యానం, విశ్లేషణలూ వెలగబెట్టడం ఏమిటి? తనని తానే ప్రశ్నించుకున్నాడు హూల్సే. కానీ కాళ్లు కదలడం లేదు. పాతేసిన గుంజలై పోయాయి.

ఏం చేసినా మెదడునీ, కళ్లనీ అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పది పన్నెండు నిముషాలు అలాగే ఉండిపోయాడు చూస్తూ. ఆటగాళ్ల ఆ మెరుపు వేగం, ఆ నైపుణ్యం ఒళ్లు పులకరింప చేస్తున్నాయి. కుదురుగా కూర్చుందామని అనుకున్నాడు కూడా.

మళ్లీ కర్తవ్యం గుర్తుకు వచ్చింది, విద్యుదాఘాతం తగిలినట్టు.

కనీసం ఆటను చూడకుండా ఉంటే ఆ క్షణంలో తన కర్తవ్యం తను నిర్వర్తించినట్టే అనుకున్నాడు హూల్సే చివరికి.

అయితే ఆట ఆపలేడా తను?!

ఒక నిశ్చయానికి వచ్చినట్టు ఫైర్‌స్టెప్ దిగడానికి విసురుగా ఓ కాలు కింద పెట్టాడు హూల్సే.

'పుర్... ర్‌ర్‌ర్‌ర్‌ర్‌ర్‌ర్‌బ్బర్బ్బబ్.........' బురదలో కూరుకుపోతున్న తన బూటు కాలు చేస్తున్న గడబిడ, కర్ణకఠోరంగా– గుర్రాల అపానవాయువు శబ్దంలా.

ముఖం చిట్లిస్తూనే, యాదృచ్ఛికంగా రెండో కాలు కూడా కింద పెట్టేశాడు. మళ్లీ అదే శబ్దం.

పంట చేలలో నిలిచిన వర్షం నీరులా కందకమంతా బురద బురదగా ఉంది. ఈ సంగతి తెలియక కాదు. ఆ తొందరలో కాలు కింద పెట్టాడు హూల్సే. నాలుగయిదు కప్పలు భయంతో చటుక్కున ఎగిరాయి. తన మీద తనకే అసహ్యమనిపించి, పళ్లు నూరాడు. బూట్లు పూర్తిగా కూరుకుపోయాయి. అదీ రోతగానే ఉంది.

ఐదారడుగుల వెడల్పు ఉంటుంది కందకం. కిందంతా నిల్వ నీరు, అసహ్యంగా. తరుచుగా కురుస్తున్న వర్షం, మంచు కందకాలలోకే చేరుతున్నాయి. కందకం గోడలు కూడా చెమ్మెక్కిపోయి ఏదో వాసన వేస్తున్నాయి. సరిగ్గా మధ్యలో ఇటుకలూ, రాళ్లూ పరిచి, దాని మీద పేరాపెట్ వాల్ కోసం తెచ్చిన కర్రలు పరిచి దారి చేశారు. అది కాలిబాటలాగే ఉపయోగపడుతోంది. చికాకుతో ఒక కాలు తీసి ఆ దారి మీద పెట్టాడు హూల్సే. తరువాత రెండో కాలు తీశాడు. అప్పుడే తూలిపడబోయి, కందకం గోడకి ఆన్చి ఉన్న నిచ్చెన పట్టుకున్నాడు, చటుక్కున. మట్టి గోడకి కొద్ది కొద్ది దూరంలో వేసి ఉన్నాయి నిచ్చెనలు. కింద బురదలోనూ, పైన గోడలోనూ నిచ్చెన కర్రల కొసలు చొచ్చుకుపోయి కనిపిస్తున్నాయి.

బంతాట మీద కోపం, కందకంలో బురద తీవ్ర అసహనానికి గురి చేశాయి. ఓటమి భావన, కోపం, బాధ కుంగతీస్తుంటే భారంగా అడుగులు వేస్తున్నాడు, పిడికిళ్లు బిగించి. దెబ్బ తిన్న పులిలాగే అడుగులు వేస్తున్నాడు. నిజానికి పులి లాంటి మనిషే హూల్సే. అలెగ్జాండర్ ది గ్రేట్ పాత్రకో, జూలియస్ సీజర్ పాత్రకో, స్పార్టకస్ పాత్ర వేయడానికో సరిగ్గా సరిపోతాడనిపిస్తుంది మనిషిని చూడగానే. కొంచెం బట్టతలయినా, చాలా ఆకర్షణీయమైన మొహం. మూతి మీది ఆ గుప్పెడు మీసం మరింత గాంభీర్యాన్ని ఇచ్చింది. విశాలమైన ఛాతీ, సన్నటి నడుం, ఆరడుగుల మనిషి. మహా అయితే ముప్పయ్ అయిదేళ్లు ఉంటాయి. నీలిరంగు కనుపాపలు ఇంకాస్త ఆకర్షణ తెచ్చాయి. దీనికి తోడు కరుకు కంఠం.

ఖాకీ రంగు సర్వీస్ డ్రెస్‌లో ఠీవిగా ఉన్నాడు.

నెత్తి మీద లెఫ్టినెంట్ టోపీ, మొలకు కత్తి. వీపు మీద ఆహార పదార్థాలు దాచుకునే కాన్వాసు సంచి హావెర్ సాక్, దాని కింద బెల్ట్‌కు తగిలించిన ఉక్కు శిరస్త్రాణం, దాని కింద ఆహారం కలుపుకు తినే గిన్నె వేలాడుతున్నాయి. ఎడమ వైపు కటి ప్రదేశం మీద బెల్ట్‌కు అమర్చి ఉన్నాయి మూడు చిన్న చిన్న తోలు పెట్టెలు– తూటాలు దాచుకునేందుకే అవి. దాని కిందే ఉంది గ్రెనైడ్ల తోలు పెట్టె. వీటిని కప్పుతున్నట్టు ఉంది ఇనప నీళ్ల సీసా. తూటాల పెట్టెలకు కాస్త ఇవతల బెల్టుకే వేలాడదీసి ఉంది షోవెల్ – బొగ్గు, మట్టి వంటివి తొలగించే పార వంటి పరికరం. ఎడం పక్క కత్తి. అవతలి వైపు పిస్టల్ హోస్టర్ కూడా ఉంది. కత్తి లేదా పిస్టల్; కాకపోతే ఆ రెండు కూడా అధికారులు ఉంచుకోవచ్చు. దాని పక్కనే బోయినెట్. చీలమండ నుంచి మోకాలి దాకా ఖాకీ రంగు బలమైన పట్టీ గుడ్డలు ఉన్నాయి. శామ్‌బ్రౌన్ బెల్ట్ పెట్టుకున్నాడు. కుడి భుజం మీద కేప్ అని పిలిచే దుప్పటి, ఎడమ భుజం మీద తుపాకీ.... దాదాపు ముప్పయ్ కిలోల బరువు.......

బైనాక్యులర్, దిక్సూచి, పెద్ద పెద్ద వైర్ కట్టర్లు కూడా రెండు వాళ్ల బ్యాగులో ఉంటాయి. పక్కనే పీక్ కేప్, రెండు అండర్వేర్లు, సాక్సుల జత, ఉలెన్‌తో అల్లిన టోపీ, మోకాళ్ల కిందవరకు ఉండే గ్రేట్‌కోట్ కూడా వాళ్ల బ్యాగులలో ఉంటాయి.

ఫ్రంట్‌లైన్‌లోని తన డగ్గౌట్ దగ్గరకు నడిచాడు హూల్సే.

ఫ్రంట్‌లైన్ డగ్గౌట్లలో కేవలం ఉన్నతాధికారులు ఉంటారు. జర్మనీ వాళ్లు షెల్స్ పేల్చినప్పటికీ పై అధికారుల ప్రాణాలు భద్రంగా ఉండడానికి వీటిని చాలా పటిష్టంగా, ఎనిమిదడుగుల లోతుండే కందకంలోనే ఇంకాస్త లోతుగా నిర్మిస్తారు వాటిని. ఒక పక్కగా మెట్లు దిగి, అక్కడ తన కోసం కేటాయించిన డగ్గౌట్ స్థలం దగ్గరగా వచ్చి నిలబడ్డాడు హూల్సే. కొంచెం మసకగా ఉందక్కడ. తడి తడి మట్టిగోడలు మరీ నల్లగా కనిపిస్తున్నాయి.

ఇంతకీ ఏం చేయాలి?! ఏం చేయాలి? ఇదే ప్రశ్న.

అప్పుడనిపించింది. 'తను కందకం విడిచి వెళ్లడం తప్పిదమేనా?'

తక్షణం రమ్మని ఆదేశించినవాడు ఫీల్డ్‌మార్షల్ జాన్ డెంటన్ పింక్‌స్టోన్ ఫ్రెంచ్– బ్రిటిష్ ఎక్స్‌పెడిషనరీ సేనల అధిపతి. ఇక వెళ్లక తప్పేదేముంది?

అత్యవసరంగా కబురు పెడితే మొన్న, అంటే డిసెంబర్ 23 అర్థరాత్రి సెయింట్ ఒమర్ పట్టణానికి బయలుదేరాడు హూల్సే. ఫ్రెంచ్ భూభాగంలో, కొంచెం లోపలగా ఉన్న సెయింట్ ఒమర్‌లోనే పశ్చిమ యుద్ధరంగ (వెస్ట్రన్ ఫ్రంట్) ప్రధాన కార్యాలయం ఉంది. పని చూసుకుని కొంతదూరం జీప్ మీద, ఇంకొంత దూరం సపోర్టింగ్ ట్రెంచ్‌ల గుండా గుర్రం మీద అష్టకష్టాలు పడుతూ వచ్చాడు హూల్సే. తను ఉన్న కందకానికి కొద్దిదూరంలో గుర్రం దిగి, అక్కడే సపోర్ట్ ట్రెంచ్ గుండా రిజర్వు ట్రెంచ్‌లోకి– అంటే యుద్ధం కోసం సిద్ధంగా ఉన్న సైనికులు వేచి ఉండే కందకంలోకి, ప్రవేశించిన హూల్సే, లోపలి దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు. నిలువెల్లా కంపించిపోయాడు భయంతో. అంతా నిర్మానుష్యంగా ఉండడమే అందుకు కారణం.

ఇంగ్లండ్ సైన్యాలకు సాయంగా వచ్చిన స్కాట్ దళాలు మోహరించి ఉన్న కందకం అది.

పశ్చిమ యుద్ధరంగం నుంచి సెయింట్ ఒమర్ అరవై డెబ్బయ్ మైళ్లు. ప్రధాన కార్యాలయానికి వెళుతున్నపుడు ఫ్రెంచ్ సైనికులు వెంట ఉన్నారు. మరునాడు తిరిగి వస్తున్నపుడే చీకట్లో దారి తప్పాడు హూల్సే. అసలే రాత్రి. దేశం కాని దేశం. భాష రాదు. ఐదారుగంటలు గుర్రం మీద ఎక్కడెక్కడో తిరగాల్సి వచ్చింది. దీనితో బాగా ఆలస్యమైపోయింది.

ఇక్కడ.... అనుకున్నంతా అయింది.

సైనిక పెద్దల అనుమానం నిజమైపోయింది. ధిక్కారం....

కందకంలోకి రాగానే లజ్జ, భయం అతడిని కుదిపేశాయి, ఒక్కసారే. తన ఆజ్ఞ లేకుండానే సైనికులు కందకం దాటి వెళ్లారా?! అసలేమైంది? ఇది స్కాట్ల కందకమే! తను పొరబడి వేరే కందకంలోకి ప్రవేశించలేదు. ఇది తథ్యం.

రిజర్వు కందకాన్ని ఆనుకుని ఉండే సహాయక కందకం (సపోర్ట్ ట్రెంచ్) లోకి గబగబా వెళ్లాడు హూల్సే. ఒక్కడైనా కనిపిస్తాడేమో చూడాలని.

అది కూడా ఖాళీగానే ఉంది.

మొత్తం కందకాన్ని శత్రు సైన్యాలు పేల్చివేయడం, లేదా, కందకం మీద దాడి చేసి అందర్నీ బందీలుగా పట్టుకుపోవడం లేదా అక్కడికక్కడే ఎవరినీ మిగల్చకుండా చంపడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. అలాంటి ఘోరం జరిగిన జాడలేవీ కనిపించనందుకు

లోపల కొంత తృప్తిగానే ఉంది హూల్సేకి.

కందకం గోడల నిండా పావురాల గూళ్లలాగా డగ్గౌట్‌లు (సైనికులు పడుకోవడానికి కందకాల గోడలను తొలిచి చేసే పెద్ద పెద్ద కన్నాలు. ఒకరిద్దరు పడుకుని నిద్రపోవచ్చు. కొన్ని మనిషి పూర్తిగా పడుకునేటంత పరిమాణంలోనూ ఉంటాయి) లేదా ఫాక్స్‌హోల్స్. వాటి పక్కనే చాలా తుపాకులు నిలబెట్టి ఉన్నాయి, బాయ్‌నెట్లతో సహా.

సైనికుడి భుజం మీద తప్ప యుద్ధరంగంలో వేరేచోట కనిపించకూడని తుపాకులు.... అలా డగ్గౌట్ల దగ్గర వదిలేసి సైనికులంతా వెళ్లిపోవడం చూసి గంగ వెర్రులెత్తిపోయాడు లెఫ్టినెంట్ హూల్సే.

యుద్ధభూమిలో సైనికుడు ఆయుధాన్ని భుజం మీద నుంచి దించడం ఘోరమైన నేరం.

ఒక్కడూ మిగల్లేదా? నమ్మకం కుదరక గాలిస్తూనే ఉన్నాడు హూల్సే అక్కడంతా. తన ఆజ్ఞని గౌరవించిన వాడు ఒక్కడైనా ఉంటాడని ఓ వెర్రి నమ్మకం. అక్కడ నుంచి మళ్లీ రిజర్వు ట్రెంచ్‌లోకి వెళ్లాడు హూల్సే. అదీ ఖాళీగానే ఉంది. ఆ చివరి నుంచి ఈ చివరికి చూసుకుంటూ వచ్చాడు లెఫ్టినెంట్ హూల్సే.

అప్పుడు గుర్తుకు వచ్చింది, తను బురదలో ఎంత దూరం నడిచాడో! గుర్రం దిగాక, సపోర్టు ట్రెంచ్‌ను గుర్తించి లోపలికి దిగి, అక్కడ నుంచి రెండు మైళ్లకు పైగానే నడిచాడు. కాళ్లు పీకుతున్నాయి. శక్తంతా సన్నగిల్లిపోయినట్టుంది. చెవుల్లో గుయ్‌మని కూత, నిస్త్రాణతో.

గత నాలుగున్నర మాసాల నుంచి ఆ బురదలోనే గడుపుతూ ఉండడం వల్ల కాబోలు, అసలు బురదలో నిలబడి ఉన్న సంగతే అతడికి ఇంతవరకూ స్పృహకు రాలేదు. లోపల ఎవరి జాడా లేకపోవడంతో కలిగిన కలవరం మరొకటి. ఆయాసపడుతూ, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ, బురదలో దిగిన కాళ్లని బలంగా లాక్కుని మళ్లీ అడుగు వేస్తూ నడిచాడంతా.

ఓపిక నశించినట్టు అలా నిలబడిపోయాడు అక్కడ. ఒక నిముషం గడిచింది. చెవుల్లో హోరు కాస్త తగ్గుతుంటే ఆ శబ్దం లీలగా వినిపించింది- కందకం బయట, అక్కడికి దగ్గరగానే..... 'ధన్'... 'ధన్'...'ధన్' మంటూ. గబగబగా కాస్త ముందుకు నడిచి అక్కడే ఫైర్‌స్టెప్ ఎక్కాడు. ఏమీ కనిపించలేదు. కొంచెం అవతల రెండు ఇసుకబస్తాలు జారి కంతలా కనిపిస్తోంది. మళ్లీ అక్కడికి వచ్చి ఫైర్‌స్టెప్ ఎక్కాడు.

బ్రిటిష్ వాళ్ల ముందువరస కందకానికి పది పన్నెండు అడుగుల అవతల ఉన్న ముళ్లతీగ నుంచి స్పష్టంగా కనిపిస్తోంది అంతా. కాస్త దూరంలోనే జర్మనీ సేనల కందకం,

దాని మీద ఇసుకబస్తాలు, దాని ముందు వేసి ఉన్న ముళ్లతీగ కూడా కనిపిస్తున్నాయి.

అదిరిపడ్డాడు హూల్సే.

చుట్టూ నాలుగు డైనమైట్లు ఒక్కసారే పేలిన శబ్దం.

యుద్ధం అన్న తరువాత పేలుళ్లు సర్వసాధారణం. తను ఉన్నది యుద్ధభూమే కూడా. కానీ ఆ పేలుళ్లు యుద్ధభూమిలోవి కాదు. ఆ దృశ్యం చూస్తున్న హూల్సే మెదడులో ఎక్కడో వినిపిస్తున్న విస్ఫోటనాలవి. నిజానికి ఇంకా పేలుతూనే ఉన్నాయి. ఆ ఊహకే కదిలిపోయాడు లెఫ్టినెంట్ హూల్సే.

చరిత్రలో కనీవినీ ఎరుగుని రీతిలో భీకరంగా పోరాడుకుంటున్న వైరివర్గాలు...పురాణాలలో చదివే యుద్ధ వర్ణనలను మించిన వాస్తవ దృశ్యాలను చూపిస్తున్నదీ యుద్ధం. చంపడం... చంపడం... చంపడమే పరమ ధ్యేయంగా సాగుతున్న రక్తక్రీడ. రోజూ కొన్ని వందల మందిని పరస్పరం చంపుకుంటున్న బద్ధశత్రువులు.... శత్రువుల మూకుమ్మడి చావు కోసం నిత్యం కొన్ని టన్నుల మందుగుండు ప్రయోగిస్తున్న రెండు శిబిరాల సేనలు.... శవాలు గుట్టలైపోతున్నాయి. గాలంతా నెత్తుటి వాసన. ఎడతెరిపి లేని వానలో, మంచులో బురదలా మారిన యుద్ధం రంగాన్ని చూస్తే కురిసింది నెత్తుటి వర్షం అనిపించేటట్టు ఉంది. అక్కడ... యుద్ధభూమి నడిబొడ్డున... చెట్టాపట్టాలేసుకుని బంతాడుకుంటున్నారు–సైనికులు.

బైనాక్యులర్స్ అవసరం కూడా లేకుండా అక్కడ నుంచి అంతా స్పష్టంగా కనిపిస్తున్నారు.

ఆడుతున్నది ఇంగ్లండ్ నాయకత్వంలో బృందం, జర్మనీ నాయకత్వంలోని బృందంతో. ఆ యుద్ధంలో కీలకమైన శత్రుదేశాల సైనికులు వాళ్లే.

ఫ్లాండర్స్ అని పిలిచే ప్రాంతంలోనే ఉన్నాయి ఆ నాలుగు కందకాలు. మొదట సాగ్జన్ల కందకం. దాని ఎదురుగా ఉన్నదే స్కాట్లండ్ సైన్యాల కందకం. కొన్ని గజాల దూరంలో ఇంకో రెండు– జర్మన్లదీ, బ్రిటిష్ వాళ్లది. ఇవీ ఎదురెదురుగానే ఉన్నాయి. జర్మన్ల కాల్బలమే సాగ్జన్లు. ఇంగ్లీషు సేనలో భాగం స్కాట్‌లు. వెస్టర్న్ ఫ్రంట్ పోరాట రేఖ పొడవునా ఇదే పద్ధతి. రాయల్ వెల్ష్ ఫసీలియర్స్, నార్‌ఫోక్ రెజిమెంట్, వార్‌విక్ రెజిమెంట్– లక్షా అరవైవేల బ్రిటిష్ సేన. లక్షా ముప్పయ్ ఎనిమిదివేల వలస భారతం సేన. ఫ్రెంచ్, రష్యా, బెల్జియం, సెర్బియా, గ్రీస్, కెనడా, పోర్చుగీస్ సేనలు ఉన్నాయి. అవతల వైపున జర్మనీతో పాటు, సాగ్జన్లు, ఆంగ్లో శాగ్జన్లు,బవేరియా, ఆస్ట్రియా సేనలు మోహరించాయి.

రక్తం ఉడికింది హూల్సేకి. ఆ క్షణంలో పెల్లుబికిన ఆవేశానికి మొహం మీద వేడి

ఆవిరి చిమ్మినట్టనిపించింది.

ఆవేశం మరింతగా పెల్లుబికి పోయింది.

'ఆపండ్రా గాడిదల్లారా!'

గొంతుదాకా వచ్చేసింది కేక. కానీ నోరు దాటి రాలేకపోయింది.

సైనికులకి ఎక్కడ ఆదేశాలు ఇవ్వాలో బాగా తెలిసిన వాడు హూల్సే. అందుకే ఆ దృశ్యం, ఆ వాతావరణం చూస్తూ ఇరవై నిముషాలు అలాగే ఉండిపోయాడు హూల్సే.

అంతా కుర్రాళ్లు.... పదహారు, పద్దెనిమిది... ఇరవయ్యేళ్ల వాళ్లే ఎక్కువ.

గుండెలో తూటా దిగినట్టు బాధపడ్డాడు. భయపడ్డాడు. అలాగే తన బలహీనత ఏమిటో కూడా హూల్సేకీ తెలుసు. తనూ ఫుట్‌బాల్ ఆటగాడే! కంటి ముందు చావో రేవో అన్నట్టు సాగుతున్న ఆట. అక్కడ ఆటగాడు బంతిని తన్నినట్టు హూల్సేలోని క్రీడాస్ఫూర్తి కొన్ని సెకన్ల పాటే కావచ్చు- అతడి కోపాన్నీ, హోదా తెచ్చిన దర్పాన్నీ దూరంగా తన్నేసింది. చిత్రంగా తనకు తెలియకుండానే ఆ ఆటకు వశీభూతుడైపోయాడు. అప్రయత్నంగా ఒకరకమైన సంయమనం వచ్చేసింది. 'ఫౌల్'అన్న ఆ మాట పెదవులు దాటి విసురుగా వచ్చేయడమే అందుకు నిదర్శనం.

కుళ్లిన మానవ కళేబరాలు తప్ప, ప్రాణాలతో ఉన్న మనిషి కనిపించని నో మ్యాన్స్ ల్యాండ్. ఇప్పుడు పరిశుభ్రంగా ఉంది. యుద్ధభూమిలో సేనలు ఉన్నాయి, యుద్ధం లేదు. భూమి మీద నుంచి హూల్సే బుర్రలోకి తరలింది యుద్ధం. ఆట చూడకుండా మనసుని అదుపు చేయలేక, ఆట ఆపాలంటూ నోటితో ఆదేశాలు ఇవ్వనూలేక ఆ ద్వైధీభావంతో సమరం చేస్తున్నాడు హూల్సే.

నిస్సహాయంగా డగ్గౌట్‌లో చతికిలపడ్డాడు హూల్సే.

ఊపిరి బిగపట్టి చూస్తున్నారు కాబోలు మనిషి గొంతు వినిపించడం లేదు. బంతిని శబ్దమే వినిపిస్తోంది లీలగా.

తటాల్న ఇంకో పెద్ద అనుమానం- ఇప్పుడు తను ఇచ్చే ఆదేశాలకు గౌరవం ఉంటుందా?!

మరి ఆ ఆటెలా ఆపడం?

డగ్గౌట్‌లో రగ్గు తడితడిగా ఉంది. మొన్న రాత్రి విడిచిన యూనిఫారమ్ అక్కడే ఉండిపోయింది. దాన్నిండా బురద.

కంటి ముందు మాయమయ్యాక, ఆ ఆట వల్ల ఎదురయ్యే పర్యవసానాల గురించిన బాధ ఎక్కువైంది. హఠాత్తుగా ఏదో రోగం బారిన పడినట్టు వాంతి అయ్యేటట్టు అనిపించింది.

ప్రధాన కార్యాలయంలో గడచిన రాత్రి బ్రిటిష్ ఎక్స్‌పెడిషనరీ దళాల సర్వ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్‌మార్షల్ జాన్ ఫ్రెంచ్ ఇచ్చిన క్రిస్మస్ కానుక వెనుక వేలాడుతున్న హేవర్ సాక్ సంచిలో బరువుగా అనిపించింది.

రెండు రాత్రులూ, పగళ్లలో ఒక్క నిముషం కూడా నిద్ర పోలేదు హూల్సే. అది పెద్ద ప్రశ్న కాదు అతడికి. ఈ యుద్ధరంగంలో దాదాపు అందరూ పడుతున్న శ్రమ అలాంటిది. కానీ ఈ కొద్ది సమయంలో పడిన హైరానా అలాంటి కొన్ని రెట్లు ఎక్కువ శ్రమ తరువాత కలిగే నిస్త్రాణలా అనిపిస్తోంది. నరాలు తెగిపోయే ఉత్కంఠ, బురదలో నడక, హైరానా – అన్నీ కలిపి శరీరాన్ని నిస్త్రాణం చేశాయి. తనలో తనే మాట్లాడుకుంటూ, సీసా తీసి దానికి చుట్టబెట్టిన కాగితం విప్పాడు. జాన్ ఫ్రెంచ్ ఇచ్చిన క్రిస్మస్ కానుక– కొనా, ఓ ఖరీదైన ఫ్రెంచ్ మద్యం సీసా.

ఆకుపచ్చ రంగు సీసాలో మద్యం చురుకుగా కదులుతోంది. నెమ్మదిగా మూత తిప్పాడు. కరుక్కుమంటూ కొద్దిగా తిరగ్గానే, నీ మనసు నాకు తెలుసు అన్నట్టు సీసాలో కల్లోలం. లేత ఎండలో తమాషాగా ఉంది. ఇసకరేణువు పరిమాణం నుంచి బఠాణీ పరిమాణంలో బుడగలు... ఎలా తయారవుతున్నాయో, ఎక్కడ పగిలిపోతున్నాయో... పుట్టడం.... పగలడం... అంతుపట్టకుండా ఆ ప్రక్రియ వేగంగా జరిగిపోతోంది. ఒక నిముషం పాటు సీసా లోపలి ఆ కల్లోలం కేసే చూస్తూ ఉండిపోయాడు.

అప్పుడే ఉన్మాదిలా తనలో తనే మాట్లాడుకున్నాడు హూల్సే.

'కుర్ర వెధవ లు,... చస్తారు వెధవలు... చావడానికే వచ్చారు.... వీరస్వర్గం .. అలంకరించండి! మీరంతా... అందుకే, అందుకే వచ్చారు.... '

కుర్రాళ్లు వాళ్లే తెచ్చుకుని, వాళ్ల చావు కోసం, వాళ్లే చేస్తున్న యుద్ధమిది అనుకున్నాడు హూల్సే.

దీర్ఘంగా నిట్టూర్చాడతడు. శరీరంలో శక్తంతా ఆవిరైపోతున్నట్టు ఉంది.

'వాడూ ఓ కుర్రకుంకే కదూ! గవ్‌రిలో ప్రిన్సిప్....ప్రపంచ చరిత్ర గుర్తు పెట్టుకోవలసినవాడివిరా బాబూ....!' కసితో కూడిన వ్యంగ్యంతో అనుకున్నాడు హూల్సే.

మళ్లీ ఆట కళ్ల ముందు కదిలింది. ఎంత ధైర్యం?! యూనిఫారాలు వేసుకుని మరీ ఆడుతున్నారు వాళ్లు!

యూనిఫారమ్ ఒంటిని కప్పగానే ఏదో కొత్త శక్తి వచ్చినట్టే ఉంటుంది సైనికులకి. నిజానికి హూల్సేలో కనిపించేది కూడా అదే శక్తీ, ఊపూ. యూనిఫారమ్ వేసుకున్న తొలిరోజే ప్రతి సైనికుడికీ సహజంగా తెలిసే విషయం కూడా ఒకటి ఉంది.

యుద్ధంలో శత్రువుతో ఏ విధంగానూ, ఏ స్థితిలోనూ చేయి కలపకూడదు. ఇది

ఉల్లంఘిస్తే సైనిక న్యాయస్థానం విధించే శిక్ష అత్యంత  కఠినంగా ఉంటుంది.

సాధారణంగా మరణ శిక్షే.......

అది గుర్తుకు రాగానే ఉక్రోషంతో, బాధతో, భయంతో  కళ్లల్లో నీళ్లు తిరిగిపోయాయి హూల్సేకి. ఒక్కసారి తల విదిలించి, ఫైర్‌స్టెప్ దిగి తను నడుచుంటూ వచ్చిన ఆ దారి వైపు తల తిప్పాడు హూల్సే.

ఇంతకు ముందు చూసిన ఆట దృశ్యమే కళ్ల ముందు కదులుతోంది. రెండు వేల మంది పైగానే ఉంటారక్కడ.

బ్రిటన్ నాయకత్వంలోని మిత్రకూటమి సైనికులూ, జర్మనీ నాయకత్వంలోని మధ్య ఐరోపా దేశాల కూటమి లేదా అక్ష రాజ్య కూటమి సైనికులే వాళ్లంతా.

ఐరోపా వాడికి ప్రాణప్రదమైన ఆ ఆట. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆడతారు. చూసేవారూ అంతే. ఇప్పుడు కూడా జీవితంలో ఆఖరిసారి ఆడుతున్నాం అన్నంత కసిగా, చావో రేవో అన్నట్టే  ఆడుతున్నారు ఆటగాళ్లు.

చూసేవాళ్లూ అంతే వేడితో స్పందిస్తున్నారు.

మనసునుంచి చెరిపివేయడం సాధ్యం కావడం లేదు. అవే ఆలోచనలు. ఇంకో వైపు రాత్రంతా విన్న సంగతులూ,  జరిగిన చర్చ ... ఇవన్నీ ఒక్కొక్క ఆటగాడి అవతారం ఎత్తి తన బుర్రని ఫుట్‌బాల్ ఆడేస్తున్నాయి. పూర్వాపరాలూ, వాటి పరిణామాలూ గుర్తుకు వస్తుంటే ఏదో భయం.

యుద్ధం అంటే –ఒక్క ఈల వేస్తే వేలాది మంది సైనికులు శత్రువుల తుపాకులకు ఎదురు వెళతారు. ఫిరంగులకు ఎదురు నిలుస్తారు. శత్రువును చంపడం... లేదా వాడి చేతిలో చచ్చిపోవడం– యుద్ధరంగంలో ఆదేశం అంటే అది. బతకదలిస్తే ప్రాణం ఎదురొడ్డి ముందుకు పో! శత్రువును చంపితే నువ్వు బతుకుతావు!పిరికితనంతో  వెనక్కి తిరిగావో, సొంత సైన్యం చేతిలో ప్రాణం ఒదిలేసుకోవాలి! కాబట్టి ముందుకే వెళ్లు... అన్నదే సైనిక ఆదేశంలో అంతర్లీనంగా వినిపిస్తూ ఉంటుంది. పారిపోయి వచ్చిన సైనికులను ఏ దేశమూ క్షమించదు.

ఇప్పుడు....  వేయి కరకు కంఠాల నుంచి ఆదేశాలు వచ్చినా ఏమీ జరగదు. పదివేల ఈలలు మోగినా ఆ ఉద్వేగాన్ని నిరోధించలేవు. ఆ ఉత్సాహాన్ని  ఆపలేవు. వాళ్లని అక్కడి నుంచి అంగుళం కూడా కదల్చలేవు.

అంతా కుర్రాళ్లు.

కిష్నర్ మూకకి (‘నీ దేశం పిలుస్తోంది, రా’ అంటూ మహా యుద్ధం–గ్రేట్‌వార్–లో చేరమని బ్రిటన్ యుద్ధమంత్రి లార్డ్ కిష్నర్ ఇచ్చిన పిలుపుతో పాలోమంటో చేరిన కుర్రాళ్లకి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Christmas+Chettu**

* * *